

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీనివాసరావు ఎస్ఐ షణ్ముఖరావు జిఎం కొత్తూరు లోని ఎపిటిడబ్ల్యుఆర్ జూనియర్ కాలేజీని శనివారం సందర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గంజాయి, సిగరెట్టు, మద్యం వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి నిర్మూలనలో సహకరించాలని, గంజాయి సాగు, రవాణాతో జరిగేటటువంటి దుష్పరిణామాలు గురించి తెలియజేశారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, సరైన ప్రణాళికతో చదవగలిగితే ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవచ్చని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో రానున్న తుఫాన్ ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 26 నుండి 29 తేదీ వరకూ తుఫాన్ కారణంగా భారీ వర్ష సూచనని వాతావరణ శాఖ ప్రకటించిందని కలెక్టర్ పేర్కొన్నారు. 28, 29 తేదీలు చాలా ముఖ్యమని, 28 అర్ధరాత్రి, లేదా 29 తెల్లవారుజామున సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్ తీరం దాటనుందని కలెక్టర్ అన్నారు. 4 రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అధికారులు ముఖ్యంగా జలవనరులు, రెవిన్యూ, పోలీసు, రవాణా, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వ్యవసాయ తదితర శాఖల అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జనరేటర్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నిత్యావసర సరుకుల పంపిణి పై ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆర్అండ్‌బి, ఈపిడిసిఎల్, వైద్య ఆరోగ్య, మత్స్య సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు అప్రమత్తం అవసరమన్నారు. మత్స్యకారులు ఎవరు వేటకి వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను తుఫాన్ రిలీఫ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను ముఖ్యంగా గర్భిణీలు, తల్లులు, చిన్నారులు, వృద్ధులను, వైద్య సహాయం అత్యవసరంగా ప్రత్యేక శ్రద్ధతో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగితే పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలన్నారు. కచ్చా ఇళ్ళు, అంగన్వాడీలు, పాఠశాల భవనాలు పై ప్రత్యేక దృష్టి సారించి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్స్, ఎంపీడీఓలు, డిఎస్పిలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఎపిఎస్పిడిసియల్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా విద్యాశాఖాదికారి, వ్యవసాయ, మత్స్య, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ రాజ్ కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు తుఫాను ప్రభావం ఉండబోతుందని తెలిపారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలని తెలిపారు. పాడుబడిన భవనాలు, ఇళ్లల్లో ఉండరాదని అన్నారు. సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని తెలిపారు. గెడ్డలు, వాగులు దాట వద్దని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని అన్నారు. తుఫాను ప్రభావంతో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే రెవెన్యూ అధికారులకు లేదా దగ్గరలోని సచివాల సిబ్బందికి సమాచారం అందజేయాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.


ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల సమ్మె జయప్రదం



ఒప్పంద పత్రం అందుకుంటున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు డివిజన్లోని ప్రభుత్వ ఆసుపత్రుల శానిటేషన్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీ నుండి నిర్వహిస్తున్న సమ్మె శనివారం విజయవంతంగా ముగిసింది. పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మెడికల్ కళాశాల, చింతపల్లి, ముంచింగిపుట్టు, అరకు వేలి కార్మికులంతా సమ్మెను ముగించుకొని శనివారం నుంచి యధావిదంగా విధులకు హాజరయ్యారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు కాంట్రాక్టర్ తో జరిపిన చర్చలు సఫలం అయ్యాయని ప్రభుత్వ హాస్పటల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు ఎల్ సుందర్రావు శనివారం విలేకరులకు తెలియజేశారు. కార్మికులకు 2024 నవంబర్లో పెరిగిన జీవో ప్రకారం 18600 పిఎఫ్ తో కలిపి వేతనం అమలు చేయడానికి అంగీకారం కుదిరిందని తెలిపారు. బకాయి వేతనాలు, పెండింగ్లో ఉన్న పీఎఫ్ నెల రోజుల్లో పూర్తిగా చెల్లించడానికి పాత కాంట్రాక్టర్ రాతపూర్వకంగా హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ముఖ్యమైన డిమాండ్లు అంగీకరించడంతో కార్మికులు ఏకగ్రీవంగా ఆమోదంతో సమ్మెను విరమించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ తో జరిగిన చర్చల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, సిఐటియు పాడేరు మండల కన్వీనర్ ప్రసాద్, ప్రభుత్వ హాస్పిటల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రఘు, అధ్యక్షులు ముత్యాలమ్మ, తో పాటు పుణ్యవతి,ఘటి,భూషణ్,చిట్టిబాబు, రత్నాలమ్మ, సుజాత, సుబ్బలక్ష్మి, కాశీ, ఈశ్వరరావు, రామారావు, సుధ, జ్ఞానమ్మ ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం



గెడ్డ దాటుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: ఈ ప్రయాణం ప్రమాదమని తెలిసినా ఎటువంటి గత్యంతరం లేక అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కు బిక్కు మంటూ ప్రయాణం చేయవలసిందె. మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి సీతంపేట గ్రామానికి చెందిన గిరిజనులకు ఈ దుస్థితి నిత్యం ఎదురవుతునే ఉంది. మండలంలో గత కొన్ని రోజులుగా ఏకధాటి ఎడతెరిపి లేకుండా కుడుస్తున్న భారీ వర్షాల కారణంగా గెడ్డలు, వంకలు, వాగులు పొంగి ప్రవేహిస్తున్నాయి. ఆయా గ్రామాల గిరిజన ప్రజలు అనారోగ్యాలకు గురైనప్పుడు . నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు, కార్యాలయాల్లో పనుల నిమిత్తం నిత్యం ఈ సాహసం చేస్తున్నారు. శనివారం కురిసిన భారీ వర్షాల కారణంగా సీతంపేట గ్రామానికి ఆనుకొని ఉన్న దిగువ ప్రాంతంలో ఉన్న తాటిపూడి రిజర్వాయర్‌కు ప్రవహించే గోస్తాని గెడ్డను ఆ గ్రామానికి చెందిన గిరిజనులు కాశీపట్నం మెయిన్ రోడ్డుకు వెళ్లి నిత్యావసర సరుకులు కొనుక్కుని తిరుగు ప్రయాణంలో ఈ ఘటన ఎదురయింది. గ్రామానికి చేరెందుకు ఎటువంటి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తప్పని పరిస్థితిలో అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని నెత్తిపై కూరకాయ పెట్టుకుని దాటుతున్న పరిస్థితి ఏర్పడింది. గ్రామనికి ఎగువ ప్రాంతాంలో ఇదే గెడ్డ బింపోలు వద్ద వంతెన దాటుతుండగా గత ఏడాది ఈ నెలలో ముగ్గురు గల్లంతయిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ గ్రామం వద్ద వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జిసిసి బంకులో కల్తీ డీజిల్‌పై చర్యలేవీ?



మాటట్లాడుతున్న ఫోరమ్‌నేతలు

ప్రజాశక్తి- హుకుంపేట: హుకుంపేట జీసీసీ పెట్రోల్ బంకులో డీజిల్ కల్తీ జరిగి వారం గడిచినా అధికారులు స్పందించకపోవడం పట్ల ట్రైబల్ రైట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్ పొయిభరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన హుకుంపేట మండల కేంద్రంలో పర్యటించి, డీజిల్ కల్తీ కారణంగా నిలిచిపోయిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, "జీసీసీ పెట్రోల్ బంకు మేనేజ్మెంట్ , అధికారులు ఈ ఘటనను పూర్తిగా నిర్లక్ష్యంగా చూస్తున్నారన్నారు. వారం రోజులైనా స్పందించలేదన్నారు. డీజిల్ కల్తీ కారణంగా ఒకేరోజు ఎనిమిది టిప్పర్లు నిలిచిపోయాయని ఆయన తెలిపారు. .బంకు మేనేజ్మెంట్‌ను అడిగితే, "26 వేల లీటర్లు స్టాక్ ఉందని, అది అమ్ముడైన తర్వాతే క్లీనింగ్ చేస్తాం" అని సమాధానం ఇచ్చారని ఆయన వెల్లడించారు. "ఇది అత్యంత బాధ్యతా రాహిత్యపు సమాధానం అన్నారు.జీసీసీ అధికారులు కల్తీపై నిజానిజాలు బహిర్గతం చేసి, నష్టపోయిన వాహనదారులకు తక్షణ పరిహారం చెల్లించాలన్నారు.జీసీసీ అధికారులు తీరును మార్చకపోతే మోటార్ యూనియన్లు, డ్రైవర్లతో కలిసి ఆందోళన చేపడతామని సతీష్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ యూనియన్ సభ్యులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో కొండచరియలు తొలగింపు



కొండ చరియలు తొలగిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని గత కొద్ది రోజులుగా ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధి ఎగువపాడు , పట్టె గ్రామాల సమీపంలో రోడ్డుపై కొండ చరియలు విరిగిపడ్డాయి. సర్పంచ్ సన్యాసిరావు చొరవతో స్థానికులు శనివారం శ్రమదానంతో మట్టి దిబ్బ, బండరాళ్లు తొలగించారు. ఎగువపాడు, దిగువపట్టే, ఎగువపట్టే, చీడివలస గ్రామాల గిరిజనులు .పంచాయతీ. మండల కేంద్రంలో ఈ రోడ్డు పైనే నిత్యం రాకపోకలు నిర్వహిస్తారు. రోడ్డుపై కొండ చరియలు విరిగి పడటంతో వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. స్థానిక గిరిజనులు శ్రమదానంతో ఈ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు చంటిబాబు, వార్డు మెంబర్స్ చిన్నయ్య పాల్గొన్నారు.

ప్రకృతి ప్రకోపం..రైతన్నకు శాపం

వీడని వర్షంతో సాగుకు ఆటంకం



నాట్లు వేసేందుకు అవకాశం లేకుండా నీటితో నిండిన పొలాలు

ప్రజాశక్తి- విఆర్ పురం : విలీన మండలాల రైతులకు వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా శబరి, గోదావరి నదులు దాదాపు మూడు నెలలపాటు గ్రామాలను జలదిగ్బంధం చేశాయి. ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోయినా వానలు, వరదలతో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. కష్టకాలం పోయిందని, పొలాల్లో వరద నీరు తొలగిందని భావించి ఇటీవల రైతులు నారు వేసే పనులకు ఉపక్రమించారు. ముందుగా వరినాట్లు పూర్తి చేశారు. అయితే అది కాస్త నీటి ముంపునకు గురైంది. మిర్చి, లంక పొగాకు, అపరాల సాగుకు ఈ ఏడాది ఎకరా మిర్చి, లంక పొగాకు సాగుకు ఇప్పటివరకూ భూమి కౌలు రూ. 15 వేల నుంచి 25 వేలు, దుక్కులకు రూ. 18 వేలు, నారు వేసేందుకు రూ.15 వేలు, నారు కొనుగోలుకు రూ.5 వేల వరకూ ఖర్చు చేశారు. తక్కువ మంది రైతులు నాట్లు వేయగా, ఎక్కువ మంది దుక్కులు చేసి, ఎరువులు వేశారు. వర్షంతో పనులన్నీ నిలిచిపోయాయి. నాటిన మొక్కలు ఎంత వరకూ బతుకుతాయోనని ఆందోళన చెందుతున్నారు. దుక్కులు దున్ని, ఎరువులు వేశారు. మిర్చి, లంక పొగాకు సాగు ప్రారంభించారు. ఈలోగా గురువారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం పగలంతా వర్షం కురుస్తూనే ఉంది. ఈ ప్రభావంతో మరో నాలుగైదు రోజుల వరకు రైతులు పొలాల్లోకి వెళ్లే పరిస్థితి లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపుగా నెల రోజుల పాటు సాగుపనులు ఆలస్యమయ్యాయి. అదును దాటితే ఆ ప్రభావం దిగుబడులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు ఆలస్యం కావడంతో ఐదు అంగుళాలు ఉండాల్సిన మిర్చి, లంక పొగాకు నారుమళ్లు మొకాలు ఎత్తు దాటడంతో వాటి చివర్లు కత్తిరించగా, కొందరు పీకేస్తున్నారు. పనులు ఇంకా ఆలస్యమైతే, నారుమళ్లు పనికిరావు. మళ్లీ నారు తెచ్చి నాటాలంటే రూ.40 వేల వరకూ ఖర్చవుతుంది. మళ్లీ వర్షాలు కురిస్తే సాగు చేయలేమని, కాడి వదిలేయడం తప్ప వేరే మార్గం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికలు ఉన్నత చదువులు చదవాలి



ఐటిడిఎలో బాలికా దినోత్సవాల్లో పాల్గొన్న పిఒ

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో ప్రతి బాలిక ఉన్నత చదువులు చదివి కేంద్ర రాష్ట్ర స్థాయి ఉద్యోగాలు పొందాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో ప్రపంచ బాలికల దినోత్సవం పురస్కరించుకుని పలు ఆటలపోటీల్లో విజేతలైన వారికి బహుమతి పంపిణీ కార్యక్రమానికి పిఒ స్మరణ్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పలువురు మహిళలు ఈ రోజున వివిధ దేశాలను శాసించే శక్తిగా ఎదిగారని ప్రపంచ బాలికల దినోత్సవం (బాలికగా నాతోనే మార్పు రండి ముందుకు) పురస్కరించుకుని ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కబడ్డీ , క్విజ్, కోకో, డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, చెస్ పోటీలు రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం, మారేడుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోటీలు నిర్వహించామన్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో రంపచోడవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 26 మంది బాలికలకు, గంగవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఎనిమిది మంది బాలికలకు ప్రాజెక్ట్ అధికారి విజేతలకు బహుమతులు అందించారు. మారేడుమిల్లి, అడ్డతీగల, రాజవొమ్మంగి ప్రాజెక్ట్ పరిధిలో విజేతలకు ఆయా సచివాలయాల పరిధిలో బహుమతి ప్రధానం చేశామని ఆయన తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో బాల్య వివాహాల గురించి ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. ఏజెన్సీలో విద్యార్థినులు శ్రద్ధగా చదువుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒలు ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని నిర్మూలిద్దాం

పలుచోట్ల ర్యాలీలు



రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



మారేడుమిల్లిలో అవగాహన కల్పిస్తున్న సిఐ

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి నివారణలో భాగంగా శనివారం రాజవొమ్మంగిలో రాజవొమ్మంగి సిఐ గౌరీ శంకర్, ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, విద్యార్థులు, స్థానిక అల్లూరి సెంటర్ నుండి ఆర్అండ్‌బి అతిథిగృహం వరకూ గంజాయి నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అల్లూరి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. గ్రామస్తులకు గంజాయి వల్ల కలిగే అనర్థాలపై సిఐ గౌరీశంకర్, ఎస్ఐ శివకుమార్ అవగాహన కల్పించారు. గంజాయి రవాణా చేసినా, సాగు చేసినా, విక్రయించినా, అటువంటి వారికి సహకరించినా నేరమని, గంజాయి స్మగ్లర్లకు ఎక్కువగా డబ్బులు వస్తాయనే ఉద్దేశంతో అమాయకులు, గిరిజనులు సహకరించి మోసపోయి తమ కుటుంబాల ను నాశనం చేసుకుంటున్నారని అటువంటి వాటికి దూరం గా ఉండాలని తెలిపారు. అటువంటివారు కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మారేడుమిల్లి సిఐ ఆధ్వర్యంలో గంజాయి పై అవగాహన కల్పించారు. శనివారం వారపు సంత కావటంతో స్థానికంగా సుమారు 200 పైగా యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మారేడుమిల్లి సిఐ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి సేవించినా, విక్రయిం చినా నేరమని యువత జీవితాలు నాశనం చేసుకోవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 7 బైకులు,రెండు కార్లు, ఒక ఆటోకు రూ.64వేలు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఆర్టిఒ రాజేష్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఎస్సై శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

ఐటిడిఎ ముట్టడిని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం: రంపచోడవరం ఐటిడిఎ ముట్టడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని దీనిని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం (ఎఐకెఎంఎస్) రంపచోడవరం డివిజన్ కార్యదర్శి ఫలాలు లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. రంపచోడవరం సమీపంలో ఉన్న పందిగుంట భూములు 27 సంవత్సరాలగా పొజిషన్లో ఉంటూ సాగు చేస్తున్న ఆదివాసీలకు పట్టాలు ఇవ్వాలని, అడ్డతీగల మండలం దాన్యం పాలెం చిన్న మొలకలగడ్డ, పెద్దమనకున్నగడ్డ దేవీపట్నం మండలం ఎం రావిలంక చిన్నబియ్యంపల్లి, రంపచోడవరం డివిజన్‌లో నివసిస్తున్న ఆదివాసీలకు హౌసింగ్‌కు పొజిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాలన్నారు. రంపచోడవరం ప్రత్యేక ఆదివాసీ జిల్లాగా ప్రకటన చేయాలన్నారు. ఏజెన్సీలో నాటుసారా తయారీ అమ్మకాలు, బెల్ట్‌షాపులపై ఉక్కు పాదం మోపాలని, ఇలా తదితర డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని లచ్చిరెడ్డి కోరారు.

'డొంకరాయి' నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి -సీలేరు: డొంకరాయి జలాశయం నుంచి శనివారం 500 క్యూసెక్కులు మాత్రమే దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామని ఎపి జెన్కో ఎఇఇ శివశంకర్ పేర్కొన్నారు. జలాశయంలోకి కేవలం 4,500 క్యూసెక్కులు మాత్రమే వరదనీరు వచ్చి చేరుతోందన్నారు. శుక్రవారం రాత్రి వరకు రెండు గేట్లు ద్వారా 4000 క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేసామన్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా శనివారం ఉదయానికి 1035.50 అడుగుల వద్ద నీటిమట్టం స్థిరంగా ఉందన్నారు. నాలుగు వేల క్యూసెక్కులలో 3,500 క్యూసెక్కుల నీటిని కుదించి కేవలం 500 క్యూసెక్కుల నీటిని మాత్రమే ఒక్క గేటు ద్వారా దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామన్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 4000 క్యూసెక్కులు పవర్ కెనాల్ ద్వారా విడుదల కాగా మరొక 500 క్యూసెక్కుల నీటిని గేట్ ద్వారా విడుదల చేస్తున్నట్టు ఎపి జెన్కో ఎఇఇ శివశంకర్ తెలిపారు.

బొర్రా టోల్ గేట్‌పై ఆందోళన


ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: పంచాయతీ ఆమోదం లేకుండా రెండు సంవత్సరాలుగా మండల పరిషత్ ఆధీనంలో కొనసాగిన ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా టోల్ గేట్‌ను పంచాయతీకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో పేసా కమిటీ సభ్యులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ, పంచాయతీ అభివృద్ధికి ఒక రూపాయి కూడా చెల్లించకుండా రెండు సంవత్సరాలు తద్వరా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయం ఏమైందని ప్రశ్నించారు. ఇందుకు పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేపట్టిందని మండల పరిషత్ తక్షణమే పంచాయతీకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు . ఏడాదికి వచ్చే ఆదాయాన్ని పంచాయతీకి 60 శాతం, మండల పరిషత్‌కి 40 శాతం వాటా కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేపట్టిందని ఆయన తెలిపారు. పంచాయతీకి అప్పగిస్తే టోల్ గేట్ నడుపుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుబ్బాయి. లక్ష్మి, వార్డు మెంబర్లు ఎస్.సింహాద్రి, లక్ష్మి, పేసా కమిటీ సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

బలవంతంగా భూములు లాక్కోవద్దు

తర్లువాడ దళితుల భూసమస్యపై కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి- ఆనందపురం: గూగుల్ డేటా సెంటర్ కోసం తర్లువాడ దళితులను నుంచి భూములను బలవంతంగా తీసుకోవడం సరికాదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. దళితుల భూములు రక్షించాలంటూ సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి , ఎస్‌సీ కమిషన్ ఛైర్మన్‌లకు లేఖ రాసినట్లు తెలిపారు.

1971లో అప్పటి ప్రభుత్వం తర్లువాడలో 49 కుటుంబాలకు ఒక్కొక్కరికీ 2 ఎకరాలు, మరికొందరిక ఎకరా చొప్పున భూమి కేటాయించగా, రాళ్లు, రప్పలు భూములను కష్టపడి సాగులోకి తెచ్చి, 54 సంవత్సరాలుగా వ్యవసాయం ద్వారా జీవనం కొనసాగిస్తున్నారనానరు. పదేళ్ల క్రితం డంపింగ్ యార్డులు, బ్యాటరీ కంపెనీలు, ఇతర ప్రాజెక్టులకు ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకునే ప్రయత్నం చేయగా, హైకోర్టు జోక్యంతో అడ్డుకట్ట పడిందన్నారు. ఇపుడు గూగుల్ డేటా సెంటర్ కోసం భూములివ్వాల్సిందేనని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారరన్నారు ఈనెల 16న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్వయంగా పిలిపించి భూములివ్వాలని కోరగా, దళిత రైతులు నిర్ద్వందంగా తోసిపుచ్చారన్నారు.

రైతులను ఒప్పించి, వారి ఇష్టపూర్వకమైతే తగు పరిహారం, ప్యాకేజీ, ఉద్యోగాలిచ్చి, సమగ్ర పరిష్కారం చూపడం ద్వారా భూములు తీసుకోవాలేగానీ, ఇలా ఒత్తిడిచేసి లాక్కోవాలనుకోవడం సరికాదన్నారు. దళిత భూముల రక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇంటర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడాకారులు నుండి గౌరవ వందనం స్వీకరించారు. 13 జిల్లాల నుంచి అండర్ 14, 17, 19 విభాగాలు బాల బాలికల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్ కుమార్, డిప్యూటీ డిఇఒ, ఆప్తా వైస్ ప్రెసిడెంట్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సభ్యులు, స్కూల్ హెచ్‌ఎంపాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య

వరద బాధితులకు అందని సాయం

ప్రజాశక్తి-కూనవరం: వరద బాధితులకు ఇప్పటివరకూ సాయం అందలేదని సిపిఎం మండల కార్యదర్శి బాబుబొర్రయ్య ఆరోపించారు. మండలంలోని స్థానిక మార్త శ్రీ రామ్మూర్తి భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు అయితే ప్రభుత్వం తక్షణ సహాయం కింద మునిగిన ఇళ్లకు రూ.10,000లు, కూలీ పనులు లేక ఇబ్బంది పడిన కుటుంబాలకు రూ.3వేలు ఇస్తామని ప్రకటించినా ఇంతవరకూ సహాయం అందించకపోవడం దుర్మార్గమన్నారు. వరదల సమయంలో అరకొరగా బియ్యం, నాలుగు బంగాళాదుంపలు నాలుగు ఉల్లిపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పటికైనా పోలవరం నిర్వాసితుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని వారిని ఆదుకో వాలన్నారు. తక్షణమే పంట నష్టాన్ని ప్రకటించకపోతే వరద బాధితుల తో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తాలూరి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, ఊయక కన్నయ్య, సోడే శ్రీరాములు, పోడియం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పరిధిలో ఎల్‌టిఆర్ ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు ఐటిడిఎ పరిధిలో ఎల్‌టిఆర్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు పిఒ శుభం నొక్వాల్ తెలిపారు. నెల రోజుల వరకూ దీనిని నిర్వహించనున్నట్టు దీనిలో డిప్యూటీ తహశీల్దార్ జె. విలెంటన్ బాబు, 9014677374, ట్రైబల్ వెల్ఫేర్ కోర్టు వారిని ఫిర్యాదులు స్వీకరించడానికి నియమించినట్టు తెలిపారు. ప్రతి బుధవారం పిజిఆర్ఎస్ ట్రైబల్ వెల్ఫేర్‌కోర్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు హాజరవుతారని పిఒ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మెడికవర్ హాస్పిటల్స్‌లో 'స్లీప్ ల్యాబ్' ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: నిద్రసంబంధిత శ్వాసకోశ రుగ్మతలు, ముఖ్యంగా అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా వంటి సమస్యలతో వచ్చే తీవ్ర అనారోగ్యా న్ని ముందుగా గుర్తించి, సమర్ధంగా చికిత్స అందించే లక్ష్యంతో, మెడికవర్ హాస్పిటల్స్ ఎంవిపి బ్రాంచ్‌లో శనివారం అత్యాధునిక స్లీప్‌ల్యాబ్‌ను ప్రారంభించింది. ఎంవిపి కాలనీలోని మెడికవర్ హాస్పిటల్స్ 6వ అంతస్తులో ఈ ప్రత్యేక సదుపాయం లాంఛనంగా అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గురక, నిద్రాభంగం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో, ఈ కొత్తల్యాబ్‌ను అధునాతన సాంకేతిక పరికరాలతో ఏర్పాటు చేసామని ఈ స్లీప్ ల్యాబ్, కచ్చితమైన రోగ నిర్ధారణ కోసం అందిస్తుందని, దీని ద్వారా రోగుల కోసం ప్రభావవంతమైన చికిత్సా రూపొందించడానికి వీలవుతుందన్నారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్, డాక్టర్ సత్యపద్మజ, డాక్టర్ మోనిష, సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన అవసరం

- సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన అవసరమని సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ప్రపంచ బ్రెస్ట్ కేన్సర్ మాసాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో 'ది పింక్ స్పిరిట్' పేరిట అవగాహన కార్యక్రమాన్ని శనివారం సిరిపురంలోని విఎంఆర్డిఎ చిల్డ్రన్స్ ఏరినా వేదికగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి హాజరయ్యారు. బ్రెస్ట్‌క్యాన్సర్ వల్ల వచ్చే ప్రమాదాలు నివారణ మార్గాలను క్షుణ్ణంగా వివరించారు. ఇటీవల బ్రెస్ట్ కేన్సర్ ఆడవాళ్లలోనే కాకుండా మగవాళ్ళలో కూడా వస్తోందని ముఖ్యంగా మహిళలు బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని అనుమానం ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించి ప్రారంభ దశలోనే చికిత్స పొందడం ద్వారా మరణాన్ని జయించవచ్చునన్నారు.

'బెర్రీ బోరర్' బాధిత కాఫీ రైతులకు

పరిహారమిచ్చి ఆదుకోండి

- ఆదివాసీ కాఫీ రైతుల సంఘం డిమాండ్


మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: బెర్రీ బోరర్ కీటక తెగులతో నష్టపోయిన కాఫీ రైతులకు నష్ట పరిహారం అందించి, కాఫీ రైతులకు మద్దతు ధర ప్రకటించాలని కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు గెమ్మెలి చిన్న బాబు, అల్లూరి జిల్లా అధ్యక్షులు పి,లక్కు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతు, అల్లూరి జిల్లా అరకులోయ మండలం చిన్నాలబుడు, చొంపి, పెదలబుడు, మాదల, కొత్తబల్లుగుడ పంచాయతీలో సుమారు 2600 మంది రైతులు 3వేల ఎకరాల్లో బెర్రీ బోరర్ తెగులతో కాఫీ పంట తీవ్రంగా నష్టం వాటిల్లిందని తెలిపారు.ప్రభుత్వం తెగులు సోకిన కాఫీకు కిలో 50 రూపాయలు, ఎకరాకు 20 వేలు రూపాయలు నష్ట పరిహారం ఇస్తామని ప్రకటించిందన్నారు. ఇది రైతులకు ఏ మాత్రం సరిపోదని బెర్రీ బోరర్ సోకిన కాఫీకు కిలో 200, ఎకరాకు రూ,50 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.బెర్రీ బొరర్ సోకిన కాయలు తీసిన కూలీలకు ఉపాధి హామీ ద్వారా కాకుండా, ఐటీడీఏ ద్వారా ప్రభుత్వమే నేరుగా చెల్లించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరాంలో జిల్లా వ్యాప్తంగా పాత తోటల పునరుద్దరణ కోసం బేగ్ పీలింగ్ చేసి తోటలు పునరుద్దరణ చేసిన 10 వేల ఎకరాల రైతులకు చెల్లించాల్సిన బకాయి డబ్బులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అరకు, పాడేరు, చింతపల్లి కేంద్రాల్లోనే కాఫీ ప్రాసెస్ యూనిట్‌లు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సంవత్సరం కాఫీ పళ్ళు కోత దశకు వచ్చిన ప్రభుత్వం రేటు ప్రకటించక పోవడంతో దళారులు ఇష్టం వచ్చిన రేట్లతో రైతుల నుండి కొనుగోలు చేయడానికి సిద్ధపడుతున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కిలో పార్చిమెంట్ కాఫీ రూ 600, పండు కాఫీ కిలో 150, చెర్రీ కాఫీ కిలో 300, మిరియాలు కిలో 1000 మద్దతు ధర ప్రకటన చేయాలని కాఫీ రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి సురేష్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించండి

ఏజెన్సీ వైద్య ఉద్యోగుల సంఘం నేతలు


డిఎంహెచ్‌ఒకు వినతిపరతం ఇస్తున్న ఏజెన్సీ వైద్య ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఏజెన్సీ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నేతలు నూతనంగా నియమితులైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కోరారు. ఈ మేరకు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం, జిల్లా అధ్యక్షులు శెట్టి నాగరాజు ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో భౌగోళికంగా ఉన్న పరిస్థితులు దృష్ట్యా క్షేత్రస్థాయి వైద్యారోగ్య సిబ్బంది కష్టపడి సేవలు అందిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని సానుకూలంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో రెగ్యులర్ అయిన 78 మంది హెల్త్ అసిస్టెంట్లు సర్వీస్ రెగ్యులేషన్, పోలీస్ ఎంక్వైరీ ఫైల్ నేటికీ ఓ కొలిక్కి రాలేదన్నారు.కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.గిరిజన ప్రాంతంలో 212 సచివాలయాలు ఉంటే అందులో 144 మంది మాత్రమే హెల్త్ అసిస్టెంట్ పనిచేస్తున్నారని, మిగిలిన 68 సచివాలయాల పని భారం కొద్ది మంది హెల్త్ అసిస్టెంట్లు మీద అదనపు భారం పడుతుందనితెలిపారు. జనాభా ప్రాతిపదికన మందులు సరఫరా చేయాల్సిన అవసరం ఉందని, జిల్లా కేంద్రంలో డ్రగ్ స్టోర్ లేదని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపాలని డిఎంహెచ్‌ఓ ను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్పీ పడాల్, నాగరాజు, మురళి, కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్ బాలయ్య, కె లక్ష్మణరావు, మమ్ముట్టి, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పరవాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జరిగిన అండర్ 19 బాలబాలికల పోటీల్లో వీరు సత్తాచాటారు. బాలికలు, 42 కిలోల విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్ విద్యార్థిని సతివాడ తులసీ ,బాలురు 45కిలోల విభాగంలో మారికివలస ఆదిత్య జూనియహర్ కాలేజీ విద్యార్థి సియ్యాద్రి నిఖిల్, 55 కిలోల విభాగంలో ఎస్‌కె రజాక్, 59 కిలోల విభాగంలో ఆసెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థి ఎస్‌కె మహ్మద్ ఆష్రాఫ్ ప్రథమ స్థానాలలో నిలిచి, ఈ నెల 26, 27 తేదీలలో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. మధురవాడ శిల్పారామం శిక్షణా కేంద్రం వద్ద వీరిని ఏపి ఆమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బసనబోయిన ఆనందరావు అభినందించారు. ఫిట్‌నెస్ ట్రైనర్, తైక్వాండో కోచ్ బి.జగదీష్ పాల్గొన్నారు.

తుపాన్ నేపథ్యంలో..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పిఒలు స్మరణ్‌రాజ్, శుభం నొక్వాల్

ప్రజాశక్తి - రంపచోడవరం : రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కారణంగా ఏజెన్సీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనిప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు వంకలు దాటవద్దన్నారు. పర్యాటక ప్రాంతాలకు రావద్దని తెలిపారు. ఐటిడిఎ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అదేవిధంగా ఎక్కడైనా వరదల్లో చిక్కుకున్న వారు కంట్రోల్ రూమ్ నెంబర్ 08864242114కు సంప్రదించవచ్చని తెలిపారు.

చింతూరు: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్ హెచ్చరించారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎక్కువగా ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సబ్‌కలెక్టర్ కంట్రోల్‌రూమ్: 9490026397/ 8121729228 (చింతూరు సబ్‌కలెక్టర్ ఆఫీసు కంట్రోల్ రూమ్) నంబర్‌కు ఫోన్ చేయవచ్చున్నారు. చేపల వేటకు వెళ్లొద్దని, వాగులు దాటవద్దని సూచించారు.

తుఫాన్ సమయంలో ఏదైనా అత్యవసరం అయితే మండల తహశీల్దార్/ ఎంపిడిఒ/ స్టేషన్ హౌస్ మాస్టర్ ను సంప్రదించాలన్నారు. వి.ఆర్ పురం మండలంలో పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద పర్యాటక బోటు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కూనవరం కంట్రోల్‌రూమ్: 9652814712, విఆర్‌పురం: 8008100892, చింతూరు: 9492527695, ఎటపాక: 8332085268

రేకుల షెడ్‌లోనే తరగతులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బందవీధిలో ప్రభుత్వం పాఠశాల భవనం నిర్మించకపోవడంతో గ్రామస్తులు తాత్కాలికంగా సిమెంట్ రేకులతో షెడ్ నిర్మించారు. అందులోనే కొద్ది సంవత్సరాలుగా విద్యాబోధన జరుగుతోందని ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ స్పందించలేదని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో 50 మంది పిల్లలు చదువుతున్నారని వీరికి ఎటువంటి సౌకర్యం లేక చాలా అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి పాఠశాల భవనం మంజూరు చేయాలని పివిటిజి గ్రామస్తులు కోరుతున్నారు.



రేకులషెడ్‌లో తరగతులు

ఠారెత్తిస్తున్న టమాటా

మూడు రోజుల్లో కిలోపై రూ.17 పెరుగుదల
రైతు బజార్లలో రూ.38,
బయట మార్కెట్లో రూ.50 వరకూ అమ్మకాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: టమాటా ధరలు ఠారెత్తిస్తున్నాయి. విశాఖ నగరంలో మూడు రోజుల్లో కిలో ధర అమాంతం రూ.17 పెరిగింది. బుధవారం కిలో రూ.21 ఉన్న టమాటా ధర గురువారానికి ఏకంగా రూ.36కు ఎగబాకింది. శనివారం మరింత పెరిగి రూ.38 ధరకు కూడా రైతు బజార్లలో దొరకని పరిస్థితి ఎదురైంది. బయటి మార్కెట్లో కిలో రూ.45 నుంచి రూ.50 ధరకు అమ్ముతున్నారు. కొంతకాలంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న టమాటాను విక్రయిస్తున్న రైతుబజార్లకు శుక్రవారం సరుకు రాకపోవడంతో ధర అమాంతం పెరిగిపోయింది.

హోల్ సేల్ మార్కెట్లో కేటు ధర రూ.1800 వరకు నిర్ణయించినట్లు తెలిసింది. నగరంలో ఉన్న రైతు బజార్లకు హోల్‌సేల్ వర్తకులు ప్రభుత్వ ధరకు సరఫరా చేయలేమని చేతులెత్తేశారు. కనీసం రూ.40 కిలో ధర ఇస్తేగానీ టమాటా సరఫరా చేసేది లేదని భీష్మించుకొని కూర్చున్నట్లు సమాచారం. ప్రభుత్వ టమాటా వస్తుందన్న ఉద్దేశంతో హోల్ సేల్ వర్తకులు కూడా తగినన్ని టమాటా లారీలను తెప్పించకపోవడంతో టమాటా కొరత ఏర్పడింది. ఇదిలా ఉండగా కృత్రిమ కొరత సృష్టించారని పలువురు ఆరోపిస్తున్నారు.


మార్కెట్లో విక్రయానికి తీసుకొచ్చిన టమాటో

హోల్‌సేల్ వర్తకులు ఏమంటున్నారు ?

భారీ వర్షాల కారణంగా టమాటా నగరానికి తక్కువ మొత్తంలో వస్తోందని, నాలుగు కేట్‌లలో టమాటా వస్తే వాటిలోని ఒక కేట్ టమాటా వర్షాల వల్ల పాడైపోతోందని హోల్‌సేల్ వ్యాపారి దాడి రామకృష్ణ తెలిపారు. తమకు నష్టాలు తప్పడం లేదన్నారు. మరికొందరూ అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉల్లిపాయలు, టమాటాల విషయంలో నిర్దిష్టమైన ప్రణాళికలతో అధికారులు ఉండకపోతే రేట్లు అమాంతం పెరుగుతాయని, ధరలకు కళ్లెం వేయలేమని పలువురు చెబుతున్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణంలో

నాణ్యతకు తిలోదకాలు

సరైన పునాది లేకుండానే పనులు : ఆగ్రహించిన మహిళలు


పునాది బలం లేకుండా కమ్యూనిటీ భవన నిర్మాణం

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని సీకరి గ్రామ పంచాయతీ పరిధి మధ్యవీధిలో కమ్యూనిటీ భవనం నిర్మాణంలో నాణ్యత గాలికొదిలేశారు. సరైన పునాది లేకుండానే కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఇక్కడ కమ్యూనిటీ భవనానికి అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి రూ.35 లక్షల నిధులు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన పనులు ఈనెలలోనే ప్రారంభించారు. శనివారం ఈ నిర్మాణ పనులను పరిశీలించడానికి వెళ్లిన స్థానిక మహిళలు నిర్మాణ పనులు చూసి షాక్ అయ్యారు. లోతైన పునాదిలేకుండానే బేస్‌మెంట్ వేస్తుండడంతో మహిళలు ఆగ్రహానికి గురయ్యారు. నాణ్యతతో నిర్మించాల్సిన భవనానికి పునాదులు లేకుండానే గోడ ఎలా నిర్మిస్తున్నారని మేస్త్రీలతో వాగ్వివాదానికి దిగారు. నిధులు చాలకపోతే ఎంపీ, ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మరిన్ని నిధులు మంజూరు చేయిస్తామని, అంతేగాని పునాది క్వాలిటీ లేకుండా భవన నిర్మాణ పనులు చేయొద్దని స్పష్టం చేశారు. మరో వైపు ఈ పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులుగాని, సదరు కాంట్రాక్టరుగాని లేకుండానే భవన నిర్మాణం చేస్తుండడంపై వారు అనుమానలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టాలని, లేదంటే పనులు నిలుపుదల చేయాలని మహిళలు డిమాండ్ చేశారు.

స్థానికఎన్నికల్లో పోటీకి సన్నద్ధం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వచ్చే ఏడాది జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో మండలంలోని పలు పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ చేసేందుకు తమకు అనుకూలమైన ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులను మచ్చిక చేసుకుని సన్నద్ధం అవుతున్నారు.. స్థానిక మండలంలో అధికార పార్టీ టిడిపితో పాటు ప్రతిపక్ష పార్టీ వైసిపి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు పోటీ చేసేందుకు అభ్యర్థులు ఉత్సాహం కనబరుస్తున్నారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వకముందే రెండు నెలల ముందుగా ఇప్పటి నుంచే పోటీ చేస్తామంటూ అభ్యర్థులు పార్టీ టికెట్ల కోసం తమ పార్టీ మండల నాయకులను, నియోజకవర్గ నాయకులను మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రధానంగా టిడిపి వైసిపి పార్టీల నుంచి పార్టీ టికెట్ కోసం అభ్యర్థులు ఎక్కువగా పోటీ పడుతున్నారు.

ఇప్పటికే మండల కేంద్రంలోని స్థానిక పోతంగి పంచాయితీతోపాటు మిగిలిన 18 పంచాయితీల నుంచి కూడా టిడిపి, వైసిపి పార్టీల నాయకులు అభ్యర్థులను కేటాయించుకునేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా పార్టీల నుంచి ఒక్కొక్క పంచాయతీలు ముగ్గురు నలుగురు అభ్యర్థులు ఒకే పార్టీ నుంచి నిలబడతామని ముందుకు వస్తుండడంతో ఆయా పార్టీల మండల నాయకులు ఎవరికి టికెట్ కేటాయించాలనేదానిపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని పంచాయతీ కమిటీ, మండల కమిటీలు చర్చించుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో స్థానికంగా పార్టీల బలం తోపాటు కులబలం, కుటుంబాల బలబలాలు ఉండటంతో ఎవరికివారు పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే కొంతమంది అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులకు వారి పార్టీ కార్యకర్తలకు తమకు మద్దతు ఇవ్వాలంటూ ప్రచారాలు కూడా చేసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం ప్రారంభమైనట్లు కనబడుతుంది.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

వ్యాసరచన పోటీలతో సామాజిక బాధ్యత పెంపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పోలీస్‌స్మారక వారోత్సవం సందర్భంగా, స్త్రీలు, బాలలను లైంగిక వేధింపుల నుండి రక్షించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు సిఐ గౌరీశంకర్,ఎస్సై శివకుమార్ శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావం పెంపొందిందన్నారు. పోటీల్లో టాప్ త్రీ విద్యార్థినిలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి వితరణ



పైపులు, సిమెంట్ రేకులు అందిస్తున్న జమాల్‌ఖాన్

ప్రజాశక్తి- విఆర్ పురం: మండలంలోని శ్రీరామగిరి పంచాయ తీ చొక్కానపల్లి గ్రామానికి చెందిన కొండరెడ్డి మహిళా మురళ శిరీషకు శనివారం జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ ఇంటి నిర్మాణానికి కావలసిన ఇనుప పైపు లు, సిమెంట్ రేకులను అందజేశారు. భారీ వర్షాల కారణం గా శిరీష ఇల్లు కోల్పోయి అవస్థలు పడుతోంది. ఈ విషయాన్ని గ్రామస్తులు నల్లారపు సత్యానా రాయణ, సర్ఫరాజ్ అలీ, జమాల్‌ఖాన్‌కు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించి ఇంటి నిర్మాణానికి కావలసిన పది సిమెంట్ రేకులు 10 ఇనుప పైపులను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్‌రాజు పాల్గొన్నారు.


కళాశాల గదులను ప్రారంభిస్తున్న వెంకట సుబ్బారావు

ఎవిఎన్ కళాశాలలో

ఆధునిక తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఎవిఎన్ కళాశాలలో నూతన తరగతి గదులు, ఆధునీకరణ విభాగాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు ప్రధానదాత పూర్వ విద్యార్థి సి.హెచ్. వెంకటసుబ్బారావు, ఎయు ఉపకులపతి ఆచార్య జి.రాజశేఖర్ సంయుక్తంగా వీటిని ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ ఎ.వి.అదీప్‌భానోజీరావు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు అజ్జరపు సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వేడుకల్లో పూర్వ విద్యార్థుల సంఘం మాజీ అధ్యక్షులు మాకిన శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్.వి.ఎన్.రామసాయి, కోశాధికారి భారతి, సభ్యులు నారాయణస్వామి, శ్రీనివాసరావు, త్యాగరాజన్ సహా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి పూర్వ ప్రిన్సిపల్ ఎం.సింహాద్రినాయుడు, కళాశాల సిబ్బంది అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. దాతలకు, పూర్వ విద్యార్థుల సంఘానికి కళాశాల కరస్పాండెంట్, వైస్‌చైర్మన్ ఎ.విఅదీప్‌భానోజీరావు కృతజ్ఞతలు తెలియజేశారు.